క్లుప్తంగా

మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా సంగీత



మహిళా కాంగ్రెస్ ప్రతినిధులుగా నియమితులైనవారితో శ్రీజ్యోతి

మొయినాబాద్: మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని నాగిరెడ్డిగూడకు చెందిన ఇంద్రపాటి సంగీత నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి శుక్రవారం నియామకపత్రం అందజేశారు. అదే విధంగా చేవెళ్ల నియోజకవర్గం ఏ బ్లాక్ ఉపాధ్యక్షురాలుగా బొడ్డు సునీత, నాగిరెడ్డిగూడ గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా స్వరూపారాణి నియమితులయ్యారు. వారికి నియామక పత్రాలు అందజేసిన అనంతరం జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను విస్తరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి తొలగింపు



మట్టిని తొలగించిన పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కేశంపేట: ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు కాలక్రమంలో పాడై పోవడంతో దానిపై కొత్తగా సీసీ వేసేందుకు మండలంలోని సంగెం గ్రామస్తులు ప్రయత్నించారు. దీంతో అదే ఊరికి చెందిన ఓ వ్యక్తి సీసీ రోడ్డు వేస్తున్న స్థలం నాదంటూ పనులను అడ్డుకున్నాడు. దీంతో అటు నుంచి రాకపోకలు సాగించే గ్రామానికి చెందిన 6వ వార్డు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇదే విషయమై గురువారం సాక్షి దినపత్రికలో 'రోడ్డు పనులు అడ్డుకున్న వ్యక్తికి నోటీసులు' అనే వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

కులగణనతో అందరికీ మేలు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్



మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్వహించిన కుల సర్వేను ఓర్వలేక కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు అర్థం లేకుండా మాట్లాడడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కామారెడ్డిలో నిర్వహించిన జోడో యాత్రలో కులగణన నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో కుల సర్వే సక్రమంగా లేదని ఆరోపించడం మానుకోవాలని చెప్పారు.

ఆలయ వార్షికోత్సవానికి విరాళం అందజేత



నిర్వాహకులకు నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ లింగం

షాబాద్: మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మాజీ సర్పంచ్ బోకుల లింగం పూజారుల ఖర్చుల నిమిత్తం రూ.27,500 నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు దయాకర్‌చారి, పెంటారెడ్డి, మల్లేశ్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మంచాల: ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆహారం విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దీప్తి అన్నారు. శుక్రవారం ఆరుట్లలో నిర్వహించిన వైద్య ఆరోగ్య శిబిరంలో ఆమె మాట్లాడారు. పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ఘన పదార్థాలకంటే ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలని చెప్పారు. ఎండలో పని చేసే నీటిని బాగా తాగాలన్నారు. ఏ మాత్రం నీరసంగా ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని, వారి సూచన మేరకు చికిత్స చేయించుకోవాలని చెప్పారు.

అకాల వర్షం... అపార నష్టం





రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, దేవునిబండ తండాలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు



గంట్లవెల్లిలో వర్షానికి నేలరాలిన ధాన్యం

- వందల ఎకరాల్లో నేలరాలిన ధాన్యం
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు

షాద్‌నగర్: అకాలంగా కురిసిన వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. వడ్డీలకు అప్పులు తెచ్చి పంటపై పెట్టుబడి పెడితే దిగుబడి చేతికందే దశలో నేలరాలిపోయింది. ఫలితంగా అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. షాద్‌నగర్‌లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. దీంతో వందలాది ఎకరాల్లో వరి, మామిడి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పెట్టుబడులు సైతం రాని పరిస్థితి ఉందని కర్షకులు లబోదిబోమంటున్నారు.

540 ఎకరాల్లో వరికి నష్టం

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి, బూర్గుల, కమ్మదనం, గంట్లవెల్లి, దేవునిబండ తండా, చింతగూడెం గ్రామాల్లో వడగళ్లలో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో 659 మంది రైతులకు సంబంధించి 540 ఎకరాల్లో వరి పంట, 24 ఎకరాల్లో మామిడి, 5 ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. సరిగ్గా దిగుబడి చేతికందే సమయంలో వరుణుడి ప్రతాపం చూపాడని రైతులు విలపిస్తున్నారు. పంట కోసే దశలో అకాలంగా కురిసిన వర్షానికి వరి పంట పూర్తిగా దెబ్బతింది. ధాన్యం మొత్తం నేలరాలిపోయింది. అదేవిధంగా పలు గ్రామాల్లో మామిడి చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. కోసే దశలో ఉన్న మామిడి కాయలు నేలరాలాయి. ఫలితంగా రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

పర్యటించిన ఎమ్మెల్యే వీర్లపల్లి

వడగళ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్న పలు గ్రామాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులను పలకరించి వారికి భరోసా కల్పించారు. పంట నష్టపోయిన కర్షకులకు పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి జాబితా సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు.

వివరాల సేకరణ

మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పొలాలను పరిశీలించి నష్ట తీవ్రతను నమోదు చేసుకున్నారు. ముఖ్యంగా వరి, మామిడి, కూరగాయల పంటలు వర్షానికి ఎక్కువగా దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు. నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు పంపిస్తామని వెల్లడించారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: ఆదర్శ మున్సిపాలిటీగా షాద్‌నగర్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు భగత్‌సింగ్‌కాలనీలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు కావాల్సిన తాగునీటి సౌకర్యం, అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు వంటి వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తామన్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్ నడికూడ సరిత ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు బస్వం, ఇబ్రహీం, శ్రీశైలం గౌడ్, యాదగిరియాదవ్, రాజు, మోహన్, విజయ్ కుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



మొయినాబాద్‌రూరల్: ముర్తుజాగూడలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

మొయినాబాద్‌రూరల్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పాడి రైతులు జాగ్రత్తగా ఉండాలని మండల పశువైద్య అధికారి డాక్టర్ అహ్మద్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ముర్తుజాగూడ గ్రామంలో జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా పశువులకు ఈ నెల 13వ తేదీ వరకు ఉచిత టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయక సిబ్బంది ప్రసన్నకుమార్, భీమ్‌రావు, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

షాబాద్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, చందనవెళ్లి, ఎల్గొండగూడ, మన్‌మర్రి లింగారెడ్డిగూడ గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్



పోతుగల్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న భీంభరత్

షాబాద్: గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు నర్సింహులు, చెన్నయ్య, యూత్ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు రవీందర్, వెంకట్‌రెడ్డి, రాంచందర్, బుచ్చయ్య, సత్యం, యాదయ్య, రాజు, గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కొందుర్గు: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని కేశంపేట జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ మండలాధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో చౌదరిగూడలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. భారతదేశానికి దిశానిర్దేశం చూపించే రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడికే బీజేపీ నాయకులు గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో త్వరలోనే పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, బీసీసెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు పిట్ట రజిత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



హోమం చేస్తున్న శ్రీలత దంపతులు

కొత్తూరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కొత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎమ్మె శ్రీలత అన్నారు. మండలంలోని ఎస్‌బీపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి కామరాతి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో శ్రీలత దంపతులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేవాలయాలు గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని, ప్రజల్లో భక్తిని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఎమ్మె సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సేవలను విస్తృతం చేస్తాం

కడ్తాల్: లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని లయన్స్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు పోతగళ్ల మహేశ్ ఆధ్వర్యంలో గోవర్ధన్‌రెడ్డితో పాటు, క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్ గుప్తాలను సన్మానించారు. లయన్స్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు చేయూతనందిస్తామని పేర్కొన్నారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య అన్నారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో సంబురాలు చేశారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులసర్వే తప్పులు తడకగా ఉందన్నారు. ప్రధాని నాయకత్వంలో సామాజిక సమానత్వం వైపు దేశంలో అడుగులు పడుతున్నాయని తెలిపారు. అందుకు ముందు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు అశోక్, కుర్మయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: దళారులను నమ్మి మోసపోకుండా.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర రూ.2320 పొందాలని డీసీసీబీ డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రం సింగిల్‌విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు ఆధ్వర్యంలో.. కడ్తాల్ మండల కేంద్రంతో పాటు, ముద్విన్ గ్రామంలో ఈ నెల 5న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్ వీరయ్య, సీఈఓ దేవేందర్, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రాంగణం.. నిరుపయోగం



ఆరుట్లలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

- కొరవడిన పర్యవేక్షణ
- తుప్పుపట్టిన క్రీడా సామగ్రి
- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న మైదానాలు
- ఆటలకు దూరమవుతున్న యువత

మంచాల: మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. లేని ప్రాంతాల్లో లేకపోగా.. ఉన్న చోట పర్యవేక్షణ కొరవడి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. వ్యాయామ సామగ్రి తుప్పుపట్టి పోతున్నాయి. క్రమంగా ఆటలకు అసౌకర్యంగా మారడంతో యువత మైదానాల వినియోగానికి ఆసక్తి చూపడం లేదు.

12 గ్రామాల్లో..

మంచాల మండలంలోని 23 పంచాయతీలకు 12 గ్రామాల్లో గత ప్రభుత్వం ఒక్కో గ్రామానికి రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల చొప్పున వెచ్చించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయించింది. మిగతా ప్రాంతాల్లో(లోయపల్లి, రంగాపూర్, ఆంబోత్‌తండా, కొర్రంతండా, సత్తితండా, బోడకొండ, ఎల్లమ్మతండా, చీదేడ్) రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలు చూపించక పోవడంతో మైదానాలు ఏర్పాటు చేయలేదు. ఆస్మత్‌పూర్, కాగజ్‌ఘట్ గ్రామాల్లో స్థలం వివాదాల కారణంగా ప్రాంగణాలకు నోచుకోలేదు. ఏర్పాటు చేసిన చోట క్రీడా సామగ్రిని సమకూర్చినప్పటికీ, పర్యవేక్షణ లోపంతో ఆటగాళ్లను ఆకట్టుకోలేక పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామానికో క్రీడ ప్రాంగణం ఏర్పాటు చేసింది. కానీ వాటిని పట్టించుకునే వారు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. అధికారులు స్పందించి వాటిని చదును చేయించి వినియోగంలోకి తేవాలి.

– చింతకింది వీరేష్ ముదిరాజ్, నోముల

నిధులు వస్తే..



గతంలో వచ్చిన నిధుల మేరకు గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయించాం. స్థలాలు లేని చోట ఏర్పాటు చేయలేదు. మరలా ప్రభుత్వం డబ్బులు ఏమీ ఇవ్వలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగతా ప్రాంతాల్లో మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు.. ఉన్నవాటిని చదును చేయిస్తాం.

– కె.వీరాంజనేయులు, ఎంపీఓ, మంచాల

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు

- ధాన్యానికి ధరతో పాటు బోనస్
- 6వేల ఎకరాల్లో వరిసాగు
- పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రారంభం



మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ రైతులకు ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సమయంలో సన్న వడ్లకు బోనస్ అందిస్తామని హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని హామీ మేరకు రూ.500ల బోనస్‌ను అందిస్తుంది. ప్రస్తుతం రబీ సీజన్‌లో వరి పంట కోతలకు రావడం, అక్కడక్కడ పంట దిగుబడులు కూడా వచ్చాయి. ఇప్పటి వరకు మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు తాము పండించిన పంటలను ప్రైవేట్ వ్యక్తులకు మద్దతు ధర కన్నా తక్కువ ధరకు అమ్ముకున్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దనే ఉద్దేశంతో, పంట దిగుబడిలో లాభాలను అర్జించాలనే లక్ష్యంతో ప్రభుత్వమే వడ్లను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది.

మండలంలో..

మండలంలోని 29 గ్రామాల పరిధిలో 6,020 ఎకరాల్లో రైతులు సన్నవడ్లతో పాటుగా దొడ్డువడ్లను సాగుచేశారు. మండల వ్యాప్తంగా సుమారుగా 13,244 టన్నుల వరకు వరి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అధికారులు కూడా అందుకు అనుగుణంగానే ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు సన్నవడ్లను కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే మద్దతు ధరతో పాటుగా క్వింటాల్‌కు రూ.500ల బోనస్‌ను ప్రభుత్వం అందిస్తుంది. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వడ్లను విక్రయించేందుకు ముందుకురావాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



సంగెంలో ధాన్యాన్ని కుప్పగా వేస్తున్న రైతు

- వడ్లలో తేమ 17శాతానికి మించకుండా చూసుకోవాల్సి ఉంటుంది.
- వడ్లలో మట్టిపెళ్లలు, రాళ్లు ఉంటే 1శాతం తరుగు
- వడ్లలో చెత్త, తాలు ఉంటే 1శాతం తరుగు
- వడ్లు చెడిపోయి ఉన్న, రంగుమారిన, మొలకెత్తిన, పురుగులు తిన్న 5 శాతం తరుగు
- వడ్లు పూర్తిస్థాయిలో లేకపోయిన, ముడుచుకొని ఉంటే 3శాతం తరుగు
- వడ్లు మిశ్రమంగా ఉంటే 6శాతం తరుగు ఉంటుంది. కాబట్టి రైతులు తగిన జాగ్రత్తలను పాటించి మద్దతు ధరను పొందాలి.

దళారులను నమ్మొద్దు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులకు మద్దతు ధర లభిస్తుంది. రైతులు కొత్తపేట పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కొనుగోలు కేంద్రంలో పంటలను అమ్ముకొని లాభాలు పొందాలి. దళారులకు పంటను అమ్ముకొని మోసపోవద్దు.

– గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్, కొత్తపేట